క్లుప్తంగా

ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని సాహితి మహిళా శిక్షణ కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్(కుట్టు మిషన్)లో శిక్షణ ఇవ్వనున్నట్లు రోటరీ అధ్యక్షుడు గోపికృష్ణ తెలిపారు. 18 ఏళ్లు నిండిన మహిళలు తమ రేషన్ కార్డ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో వచ్చి జర్నలిస్ట్ కాలనీలో గల సాహితి శిక్షణ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 నుంచి నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

రోడ్డు కబ్జాపై ఫిర్యాదు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ఎన్టీఆర్ కాలనీలో రోడ్డు కబ్జా చేసి హద్దు రాళ్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు శుక్రవారం ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు కబ్జా చేస్తే కాలనీ ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



బాల్కొండ: వరి పంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కిసాన్‌నగర్‌లో పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వరి నాటిన 15 నుంచి 25 రోజుల వ్యవధిలో మొగి పురుగు నివారణకు క్లోరాంత్ర నీలిప్రోలు గుళికలు 4 కిలోలు లేదా ఇమామెక్టిమ్ బెంజయిట్ ప్లస్ కార్టాప్ హైడ్రో క్లోరైడ్ గుళికలు 3 కిలోలు చల్లుకోవాలని సూచించారు. అధిక మోతాదులో యూరియా వాడితే అగ్గి తెగులు, దోమ పోటు సోకే ప్రమాదం ఉందన్నారు. ఏఈవో నిహారిక తదితరులు ఉన్నారు.

సౌదీలో సంక్రాంతి వేడుకలు



బాల్కొండ : సౌదీ అరేబియాలోని రియాద్‌లో శుక్రవారం సాటా(సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్) ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేపట్టిన నృత్యాలు అలరించాయి.

చెక్కు అందజేత

రుద్రూర్ : కోటగిరి మండలం కల్లూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు డిసేబుల్ కోటాలో మంజూరైన రూ.50వేల చెక్కును వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ అందచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రజాప్రతినిధుల సమక్షంలో చెక్కు అందచేశారు. ఎంపీడీవో మనోహర్ రెడ్డి, తహసీల్దార్ రమేష్ ఉన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి



నందిపేట్: దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త శ్రీనివాస్ రావు సూచించారు. నందిపేటలోని భవిత కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్రతి శుక్రవారం డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తున్నట్లు తెలిపారు. మండల రిసోర్స్ పర్సన్ నాగేష్ గౌడ్, సురేష్ పాల్గొన్నారు.

శ్రీ చక్రేశ్వర ఆలయంలో పనులకు టెండర్

బోధన్‌రూరల్ : మహా శివరాత్రి వేడుకల సందర్భంగా బోధన్‌లోని శ్రీ చక్రేశ్వర ఆలయంలో పనుల కోసం శుక్రవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో టెండర్ ప్రకటన చేశారు. ఆలయంలో రంగులు, డోర్లు, కిటికీలు, క్యూలైన్ల బారికేడ్లు, పెళ్లి పందిరి, లైటింగ్స్ సౌండ్ సిస్టమ్, పూల అలంకరణ వంటి పనులను చేసేందుకు ఆసక్తి కలవారు ఈ నెల 26 తేది 12గంటల వరకు కొటేషన్స్ సమర్పించవచ్చని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. అదే రోజు దరఖాస్తులను పరిశీలించి అర్హత పొందిన వారికి పనులు చేసేందుకు కాంట్రాక్ట్ అప్పగిస్తామని ఆలయ ఈవో రవీందర్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్/ఆర్మూర్‌టౌన్ : ఆలూర్‌లోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల, మామిడిపల్లిలోని మైనారిటీ బాలికల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ సయ్యద్ హైదర్, నాహిదఫిర్దౌజ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఐదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగంలో మైనారిటీ, నాన్ మైనార్టీ(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ) సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- లేకపోతే అధికారులపై కఠిన చర్యలు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బోధన్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



రాణాకలాన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి : ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని రాణాకలాన్, కుర్నాపల్లి, మంగళ్‌పహాడ్, ఎడపల్లి, అంబం, బ్రాహ్మణపల్లి, జైతాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. రాణాకలాన్ ప్రజలు సరైన ఆర్టీసీ రవాణా సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని దృష్టికి రావడంతో బోధన్‌-నిజామాబాద్ బస్సులను రాణాకలాన్, కుర్నాపల్లి, మంగల్పహాడ్ మీదుగా వెళ్లేలా చర్యలు చేపట్టామన్నారు. రాణాకలాన్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డితో కలిసి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే టికెట్ తీసుకొని బస్సులో ప్రయాణించారు. అనంతరం ఎడపల్లి, మంగళ్‌పహాడ్, అంబం , బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. జైతాపూర్‌లో పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసగా మారుతున్నారని, మత్తు పదార్థాల నియంత్రణతో పాటు బెల్టు షాపుల కట్టడికి ప్రత్యేక దృష్టి సాధించాలని బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్‌ను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించండి

బోధన్‌టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసుకొని ముందుకు సాగుతుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. శుక్రవారం పట్టణంలోని అయేషా గార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ టీచర్ల వినతి

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఎడపల్లి మండలం అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని కోరారు. హేమమాలిని, తులసి, విజయ లక్ష్మి, విమలాదేవి, వీణ, సుజాత ఉన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్పీలు వినతి పత్రం అందజేశారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. పీఆర్‌టీయూ ప్రతినిధులు శంకర్, థామస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు

ఎడపల్లి : మండలంలోని జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈవో వేణు ఎమ్మెల్యేకు నరసింహస్వామి చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా జానకంపేట కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు.

అమీర్‌నగర్ పాఠశాలలో తొమ్మిదో తరగతికి అనుమతి

కమ్మర్‌పల్లి: మండలంలోని అమీర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి నిర్వహించడానికి విద్యాశాఖ కమిషనర్ నుంచి అనుమతి లభించింది. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో ఇది వరకు ఎనిమిదో తరగతి వరకే అనుమతి ఉంది. కానీ అనుమతి వస్తుందనే ఉద్దేశంతో అనధికారికంగా తొమ్మిదో తరగతి నిర్వహిస్తున్నారు. డీఈవో దుర్గాప్రసాద్ విజ్ఞప్తి మేరకు 2023–24 విద్యా సంవత్సరానికి 9వ తరగతి నిర్వహించుకోవడం కోసం ఉత్తర్వులు జారీ చేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి కృషితో పాఠశాలకు అప్‌డేషన్ లభించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి తెలిపారు.

పసుపు కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి



బాల్కొండ : మహిళా సమాఖ్యల ద్వారా పసుపు పంటను కొనుగోలు చేయుటకు సిద్ధంగా ఉండాలని ఏపీడీ మధుసూదన్ అన్నారు. శుక్రవారం బాల్కొండలో మహిళా రైతు ఉత్పత్తుల సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో పసుపు పంటను కొనుగోలు చేయాలన్నారు. అలానే రైతులకు మహిళా సమాఖ్యల ద్వారా యూరియాను సరఫరా చేసే ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. లావాదేవీలను నిర్వహించి, లాభాలను గడించాలన్నారు. డీపీఎం మారుతి, ఏపీఎంలు గంగాధర్, ప్రసాద్‌రావు, విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం



నందిపేట్ : ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను శుక్రవారం నందిపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ గొప్ప పార్టీ అని, కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మండలంలో గల సమస్యల గురించి ఆయన ఆరా తీశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మంద మహిపాల్, బైండ్ల ప్రశాంత్, లక్ష్మణ్ గౌడ్, జాకీర్ హుస్సేన్, ఈసూప్, డీవీడీఎస్ గౌడ్, వైఎస్ గంగాధర్, సాయిరాం, ఎడ్డీగారి నిఖిల్, ఎర్రోళ్ల రవి, సంజీవ్ పాల్గొన్నారు.

సత్యం, రవి మరణాలపై విచారణ చేపట్టాలి



ఆర్మూర్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మరణించిన దళిత నాయకులు తలారి సత్యం, చేపూర్ రవి మరణాలపై సీబీఐ విచారణ చేపట్టాలని రాజకీయ పార్టీల దళిత ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ సావేల్ గంగాధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జేఏసీ నాయకుడు దేగాం యాదాగౌడ్‌తో కలిసి మాట్లాడారు. 2016లో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని ప్రశ్నించినందుకు సత్యంపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా సత్యంతో పాటు చేపూర్ రవిని టిప్పర్‌తో గుద్దించి హత్య చేయించాడని ఆరోపించారు.

రేపు ఆర్మూర్‌లో వర్ధంతి సభ

పట్టణంలోని తాజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 21న తలారి సత్యం, చేపూర్ రవి 8వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మేధావులు, ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు తరలి రావాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు జీవన్, దాసరి నర్సయ్య, గోపి, రమేశ్, తలారి సత్యం తండ్రి గంగాధర్, ప్రజా పంథా నాయకులు రాజన్న, నరేందర్, నిఖిల్, మహేశ్ పాల్గొన్నారు.

కిరాయి చెల్లించలేదని దుకాణం ఖాళీ చేయించిన అధికారులు



వస్తువులను స్వాధీనం చేసుకున్న అధికారులు

బోధన్‌టౌన్ : బోధన్‌లోని మారుతి మందిరం పరిధిలోని ఒకటో నంబర్ దుకాణందారుడు అద్దె చెల్లించక పోవడంతో శుక్రవారం దేవాదయ శాఖ అధికారులు దుకాణంలోని వస్తువులను స్వాధీనం చేసుకొని ఖాళీ చేయించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపిన వివరాలు.. గదిని అద్దెకు తీసుకున్న ఎం రవి అద్దెకు తీసుకొని బంగారు ఆభరణాల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయన 2023 జూన్ నుంచి అద్దె కట్టలేదు. నోటీసు అందించినా స్పందించక పోవడంతో శనివారం పోలీసులు, రెవెన్యూ అధికారుల సహాయంతో దుకాణంలోని వస్తువులను స్వాధీనం చేసుకొని ఖాళీ చేయించామని ఆమె తెలిపారు. దుకాణంలో స్వాధీనం చేసుకున్న వస్తువులను ఈవో రవీందర్ కార్యాలయంలో భద్రపరిచామన్నారు. దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ రాములు, రెవెన్యూ శాఖ ఆర్ఐ వరుణ్, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ కుమార్ శర్మ ఉన్నారు.

పసుపు, ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్

ఆర్మూర్ : పసుపు, ఎర్రజొన్న పంటలకు గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యాలయంలోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. క్వింటాలు పసుపునకు రూ.15 వేలు, ఎర్రజొన్నకు రూ.4,500 చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా వరంగల్ డిక్లరేషన్‌లో రైతులు పండించిన అన్ని పంటలను కొనుగోలు చేస్తామని, రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులని ఆదుకోవాలన్నారు.


బోధన్, మెట్‌పల్లి, మెదక్‌లోని షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి చెరుకు రైతులకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవారాం, జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, నాయకులు రాజన్న, ఆకుల గంగారం, గంగాధర్ పాల్గొన్నారు.

గాజుల్‌పేటలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పరిధిలోని గాజుల్‌పేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కాలనీకి చెందిన వాసుగౌడ్ శబరిమల వెళ్లాడు. ఆయన భార్య సునీత ఈ నెల 15న దుబ్బలోని తన తల్లిగారింటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం వాసుగౌడ్ ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.2 లక్షలు, 12 తులాల బంగారం, కిలోన్నర వెండి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి


- షుగర్ ఫ్యాక్టరీలను తిరిగి తెరిపించాలి
- ఎన్డీఎస్ఎల్ కార్మిక నాయకుల వినతి



హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద ఎన్డీఎస్ఎల్ కార్మిక నాయకులు

బోధన్: మూతపడిన ఎన్డీఎస్ఎల్ బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజీపల్లి(మెదక్) యూనిట్లను పునరుద్ధరించాలని, కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని ఫ్యాక్టరీ కార్మిక నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మూడు ఫ్యాక్టరీలకు చెందిన కార్మిక నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఎస్ఎల్ మజ్దూర్ సభ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఫ్యాక్టరీ ప్రైవేటు యాజమాన్యం కలిసి అకారణంగా మూసివేశాయని పేర్కొన్నారు. 8 ఏళ్లయినా బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల పిల్లల చదువులు, పెళ్లిళ్లు ఆగిపోయాయని, చాలా మంది కార్మికులు అనారోగ్యంతో చనిపోయారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి షుగర్ ఫ్యాక్టరీలను పునఃప్రారంభిస్తామని, ఇందుకు నిపుణుల కమిటీ వేస్తామని ప్రకటించారన్నారు. అనంతరం తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి కార్మికుల సమస్యలను వివరించినట్లు ఉపేందర్ చెప్పారు.

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి



బాల్కొండ : బీఎల్‌వోలు శని, ఆదివారాల్లో పోలింగ్ స్టేషన్‌ల వద్ద అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. 20, 21 తేదీల్లో ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ ఉండటంతో బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు. డీటీ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బోధన్‌టౌన్ : తపాలా శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి కోరారు. శుక్రవారం తాపాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తపాలా శాఖ పథకాలపై అవగాహన కల్పించారు. బోధన్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

- 'డబుల్' ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వాలి
- కోటగిరి మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్

రుద్రూర్ : రోడ్లు భవనాల శాఖ పనితీరు సరిగా లేదని మండల సభలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లకు మరమ్మతులు చేయడంతో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి సరాఫరా నిర్వహణతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారమవుతోందని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు లేక ఇబ్బందులు పడుతున్న జీపీలపై మరింత భారం పడుతుందని, దీని నిర్వహణను మిషన్ భగీరథ చూసుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల కోసం ఇసుక, మొరం కోసం డీడీలు చెల్లించినా ఇబ్బందులు తప్పడం లేదని ఎత్తోండ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పనులకు ట్రాక్టర్‌కు రూ.900, ప్రభుత్వ పనులకు రూ.660 డీడీలు చెల్లించాలని పోతంగల్ తహసీల్దార్ రమేష్ వివరించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు జీపీ కార్యదర్శి ద్వారా ధ్రువీకరణ పత్రం అందచేస్తే ఉచితంగా సరఫరాకు అనుమతి ఇస్తామని తెలిపారు. సుంకిని పాఠశాలలో టీచర్ల కొరత తీర్చాలని సర్పంచ్, ఎంపీటీసీలు కోరారు. ఉమ్మడి మండలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులు వచ్చే ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ మనోహర్ కోరారు. సమావేశంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, కోటగిరి, పోతంగల్ తహసీల్దార్లు ప్రభాకర్, రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



గుట్టను పరిశీలిస్తున్న తహసీల్దార్

బాల్కొండ: అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీధర్ అన్నారు. బాల్కొండలో మొరం వ్యాపారులు గుట్టలను గుల్లా చేయడంపై గురువారం సాక్షి పత్రికలో 'గుట్టలను కరిగించారు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో తహసీల్దార్ తవ్విన గుట్టలను శుక్రవారం పరిశీలించారు. మొరం తవ్వకాలకు ఎవరికి అనుమతివ్వలేదన్నారు. అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రాములు

బోధన్ : తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని శుక్రవారం పట్టణ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి ఆవిష్కరించారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారావు, అద్దంకి ఉషాన్, జ్ఞానేశ్వర్, ప్రకాశం, పబ్బ మురళి, వెంకట్రావ్, సత్యానందు, కోటేశ్వర్‌రావు, లింగయ్య, సీతారాం, అన్నమేరి, రమాదేవి, జనార్దన్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్..

డొంకేశ్వర్ : పీఆర్‌టీయూ–టీఎస్ క్యాలెండర్‌ను డొంకేశ్వర్ తహసీల్దార్ రాములు శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పీఆర్‌టీయూ–టీఎస్ మండలాధ్యక్షుడు కె నరేశ్, రామ్‌రెడ్డి, సుభాష్, పురుషోత్తం, రాజేశ్వర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

అంతా రామమయం

- అయోధ్య రామమందిర ప్రారంభం నేపథ్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు
- గ్రామాల్లో ముస్తాబైన ఆలయాలు



రెంజర్లలో ముస్తాబైన కోదండ రామాలయం

బాల్కొండ: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో అంతా రాములోరి నామస్మరణలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో ఆలయాల్లో ఉత్సవాలను నిర్వహించుటకు వీడీసీలు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. 22న ప్రాణ ప్రతిష్ఠ ఉండటంతో శనివారం నుంచి ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్, ముప్కాల్ మండలం రెంజర్లలో, మెండోరా మండలం పోచంపాడ్‌లో గల కోదండ రామాలయాలను అందంగా ముస్తాబు చేశారు. మూడు రోజుల పాటు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో మటన్, చికెన్, మద్యం షాపులను సైతం మూడు రోజుల పాటు మూసి ఉంచాలని ఇది వరకే కొన్ని గ్రామాల్లో చాటింపు వేయించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్: బోధన్‌లోని అజామ్ గంజ్, చెక్కి క్యాంపు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ బేనర్జీ తెలిపారు. చెక్కి క్యాంప్ విద్యుత్ కేంద్రంలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

నందిపేట మండలంలో..

నందిపేట్: నందిపేట్, మాక్లూర్ మండల విద్యుత్ వినియోగదారులకు శనివారం సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ అశోక్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు.

నవీపేట మండలంలో..

నవీపేట: నవీపేట, కమలాపూర్ గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని, ఏఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నవీపేట సబ్ స్టేషన్ పరిధిలోని నవీపేట, అభంగపట్నం, అబ్బాపూర్(ఎం), ధర్యాపూర్, స్టేషనస్ ఏరియా, పోతంగల్, శివతండా, హనుమాన్‌ఫారమ్, శ్రీరామ్ తండా, కమలాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కమలాపూర్, మహంతం, రెడ్డిఫారమ్, మోకన్‌పల్లిలో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.